## తమిళనాడు బోట్లను అరికట్టండి : మత్స్యకారులు



కోట, జూలై 9 ప్రభాతవార్త

తమిళనాడు రాష్ట్రానికి చెందిన హైస్పీడ్ బోట్లు కోట, వాకాడు మండలాల పరిధిలోని సముద్రంలోకి వస్తున్నాయని ఆయా మండలాలకు చెందిన మత్స్యకారులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో సముద్రంలో వేటాడే మత్స్యకారుల వలలను తెంపుకొని వెళుతున్నారని వాపోతున్నారు. మత్స్యకారులంతా కలిసినా వారిని అడ్డుకోలేకపోతున్నామని పేర్కొంటున్నారు. ఈ ప్రాంత మత్స్యకారులు పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆ సమస్యను విన్నవిస్తూనే ఉన్నారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సముద్రంలో వేట సాగక, పూడ గడవక వేరే ప్రాంతాలకు వలస పోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. రెండు రాష్ట్రాల మధ్య అంతర్గత సమస్య ఉన్న నేపథ్యంలో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి జోక్యం చేసుకొని తమిళనాడు బోట్లను అరికట్టాలని కోరుతున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కూడా స్పందించి తమిళనాడు బోట్లు ఈ ప్రాంతానికి రాకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త






## తిరుపతిలో ఎమ్మెల్యే యవ్వారంపై

# తెలుగుతమ్ముళ్ళ గుస్సా!

### -మా అధినేత చంద్రబాబు వద్దే తేల్చుకొంటామంటున్న నేతలు
### -నామినేటెడ్ పదవులపై ఆరణి పై అసంతృప్తి సెగలు



ప్రభాతవార్త-తిరుపతి టౌన్:

"ఏరు దాటేవరకు ఓడ మల్లన్న-ఏరు దాటాక బోడిమల్లన్న"అనే రీతిలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన అనుచరుల వ్యవహారం తయారైందని తెలుగుదేశం పార్టీ నేతలు కస్సుమంటున్నారు. తన సొంత పార్టీ అయిన జనసేన నేతలు ఎవరు?ఏమిటీ అని కూడా తెలుసుకోకుండా తిరుపతిలోని పలు కీలక శాఖల నామినేటెడ్ పదవులకు పేర్లుసిఫార్సుచేయడమే ఇప్పుడు కూటమిపార్టీల్లోని టిడిపి, బిజెపి నేతలు ఆగ్రహం వెలిబుస్తున్నారు. చిత్తూరుకు చెందిన ఈయన్ను గత సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా తిరుపతికి తీసుకువచ్చి జనసేన పార్టీతరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన కూటమి నేతలు ఆయన గెలుపుకు సహకరించాలని హితవు చేశారు. ఎన్నికల సమయంలో తొలుత స్థానికులను కాదని బయటినుండి నాయకుడ్ని తీసుకురావడం పట్ల అటు జనసేనపార్టీతోబాటు ఇటు తెలుగుదేశంపార్టీలో అదే సామాజిక వర్గంకు చెందిన వాళ్లు అంగీకరించలేదు. తొలిరోజుల్లో కొంతవరకు ఆయనకు సహాయనిరాకరణ కూడా ప్రకటించారు. అయితే తిరుపతిలో తెలుగుదేశం పార్టీలో నేతల మధ్య ఐక్యత లేకపోవడం, పార్టీకేడర్ నాయకులు పదవులతోసరిపెట్టుకుని పార్టీని బలోపేతం చేసుకోలేకపోవడంతో జనసేనపార్టీ తరపున తిరుపతిలో టిక్కెట్ కేటాయించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలుగుదేశం వర్గాల్లో హాట్‌టాఫిక్ అయ్యింది. తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు, యువనేత నారాలోకేశ్‌తోబాటు జనసేనాని పవన్‌కల్యాణ్ కూడా తిరుపతి నేతలతో స్వయంగా మాట్లాడి సమన్వయం చేశారు. ఎన్నికల్లో టిడిపి కేడర్, నేతలు గట్టిగా పనిచేసి ఆరణిని గెలిపిస్తే ఎంఎల్‌సి తోబాటు నామినేటెడ్ పదవులను కట్టబెడతానని అధినేత ,ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతి నేతలకు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని స్థానిక నేతలందరూ గుర్తుచేసుకుంటున్నారు. ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసుల్ని గెలిపించుకోవడం జరిగింది. నెలరోజులు కావస్తుండటంతో ఇప్పుడు నామినేటెడ్ పదవులు పందేరంపై కూటమిలోని జనసేన,టిడిపి, బిజెపి నేతలు దృష్టి సారించారు. ముఖ్యంగా తిరుపతిలో తుడ ఛైర్మన్, పాలకమండలి,రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, ఆస్పత్రుల అభివృద్ధి సంక్షేమ కమిటీ ఛైర్మన్ పదవులు, జిల్లా గ్రంధాలయ ఛైర్మన్, డైరెక్టర్ పదవులు, కులసంఘాల బోర్డుల ఛైర్మన్‌లు, డైరెక్టర్ పదవులు, పాఠశాల కమిటీలు, విద్యాభివృద్ధి కమిటీల్లో పదవులు, టిటిడి బోర్డులో సభ్యత్వం, స్థానిక ఆలయాల పాలకమండళ్ళులో ఛైర్మన్, సభ్యుల పదవులు వంటివాటిపై తెలుగుదేశం పార్టీ నేతలు, సీనియర్ నేతలు దృష్టి పెట్టారు. అయితే ఈ పదవుల పంపకంపై స్థానిక ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు ఏకపక్షధోరణితో వ్యవహరిస్తున్నారని, ఎన్నికల్లో గెలుపుకు కష్టపడి పనిచేసిన వారిని కాదని తనకిష్టమొచ్చిన వారిని ఎంపికచేసేలా ఆయన ధోరణి మారిందనే ఆవేదన తెలుగుదేశంపార్టీ,బిజెపినేతల్లో వ్యక్తమవుతోంది. నలభైఏళ్ళ సుదీర్ఘచరిత్ర ఉన్న తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులు, ద్వితీయశ్రేణి నాయకులు పార్టీని నమ్ముకుని ఉన్నవాళ్ళను కలుపుకుని పోవడంలో ఎమ్మెల్యేగా ఆయన వ్యవహారం మారలేదనేది బహిరంగంగా వినిపిస్తున్న విమర్శలు. కొంతమందిని మాత్రమే కలసి తనశైలిలో వెళ్ళిపోతున్నాడనే లుకలుకలు లేకపోలేదు. ఇప్పుడు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కూటమి పార్టీలో నేతలు ఎమ్మెల్యే ఆరణి తీరుపై బహిరంగంగానే తిరుగుబాటు జెండా ఎగురవేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ పంచాయితీ ఏకంగా తమ అధినేత చంద్రబాబు వద్దే తేల్చుకుంటామని కొందరు నేతలు వ్యాఖ్యానిస్తుండటం కొసమెరుపు.

## మనోవికాస్ ఆశ్రమ పాఠశాలలో

# ప్రబలిన డయేరియా

### అనాథ మానసిక దివ్యాంగులు 16మందికి వాంతులు విరేచనాలు ఇద్దరు మృతి , మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం ఆరోగ్యమంత్రి ఆరా





తిరుపతి/తిరుపతిహెల్త్,జులై 9ప్రభాతవార్త:

తిరుపతి పద్మావతిపురంలో మానసిక దివ్యాంగ అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్న మనోవికాస్ ఆశ్రమ పాఠశాలలో డయేరియా ప్రబలి ఇద్దరు మానసిక దివ్యాంగులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగామారింది. వీరిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా అతి సార బారిన పడిన మరో 16మంది వాంతులు విరేచనాలతో రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆశ్రమపాఠశాలలో అందరూ అనాథ దివ్యాంగులే కావడం విచారకరం. భోజనం కలుషితం కావడంతోనే ఆదివారం మధ్యాహ్నం ఇలా జరిగిందని, స్థానికంగా ఉన్న వైద్యుడు వైద్యచికిత్సలు అందించినా ఫలితం లేకపోవడంతో 16మంది వరకు తీవ్రస్థాయిలో అతిసారకు గురవడంతో ఆశ్రమపాఠశాల నిర్వాహకులు, సిబ్బంది వారిని హుటాహుటిన ఆదివారం రాత్రి రుయాకు తరలించారు. చికిత్స పొందతున్న విషయాన్ని పాస్ సంస్థ నిర్వాహకులు గోప్యంగా ఉంచారు. మంగళవారం ఉదయం ఇద్దరు అనాథ మానసిక దివ్యాంగులు ప్రాణాలు కోల్పోవడంతో సమాచారం బయటకు పొక్కింది. దీంతో జిల్లా యంత్రాంగం మంగళవారం మధ్యాహ్నానికి రుయాకు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించింది. కాగా పాస్ సంస్థ మనోవికాస్ ఆశ్రమ పాఠశాలలో పరిశుభ్రత అంతంతమాత్రంగానే ఉండటం, తాగునీరు కొంత అపరిశుభ్రంగా ఉండటం కారణంగానే డయేరియా వ్యాప్తికి కారణంగా ప్రాదమికంగా జిల్లా అధికారులు గుర్తించారు. ఆశ్రమ పాఠశాలలో 72మంది వరకు అనాథలైన మానసిక దివ్యాంగులు ఆశ్రమం పొందుతున్నారు. వీరంతా 15ఏళ్ళనుండి 45ఏళ్ళ వరకు ఉన్నారు. డయేరియాతో మానసిక దివ్యాంగ అనాథ యువకులు గణపతి(30), శేషాచలం(15) మృతి చెందారు.సమాచారం అందుకున్న తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు,ఆశ్రమ పాఠశాల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణమూర్తి రుయాకు చేరుకున్నారు. డయేరియా బారిన పడి మృతి చెందిన ఇద్దరు మానసిక దివ్యాంగుల మృతదేహాలను పరిశీలించారు. అనంతరం వార్డులో చికిత్స పొందుతున్న మరో 14మంది దివ్యాంగులను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని రుయా సూపరింటెండెంట్ రవిప్రభును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాగా తిరుపతిలో డయేరియా ప్రబలి ఇద్దరు మృతిచెందిన ఘటనపై ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ జిల్లా కలెక్టర్‌తో సంప్రదించారు. మెరుగైన వైద్యం అందించాలని, ఆశ్రమపాఠశాల పనితీరు అక్కడి పరిస్థితులుపర్యవేక్షించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

**కలెక్టర్ పరామర్శ:**

మంగళవారం స్థానిక రుయా ఆసుపత్రిలో డయేరియా బారినపడి చికిత్స పొందుతున్న వార్డును జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పర్యటించారు. ఇక్కడ చికిత్సపొందుతున్న వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపాడు. ఇద్దరిని మిగతా వారికి మెరుగైన వైద్యం కోసం స్విమ్స్ ఆసుపత్రికి తరలించాలని వైద్యులను ఆదేశించాడు. పలువురికి ప్రత్యేక వైద్యుల ద్వారా చికిత్స అందిస్తున్నారన్నాడు. మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలని ఎన్జీఓ ఆధ్వర్యంలో నడుస్తున్నదని తెలిపాడు. జులై 6న మధ్యాహ్నం అల్పాహారం తీసుకున్న తర్వాత ఆదివారం ఉదయం నుంచి కొంతమందికి వాంతులు, విరోచనాలు అయిన వారికి మెట్రోజెల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వారికి అందించడం జరిగిందని, అయినప్పటికి వారికి డయేరియా కంట్రోల్ కాకపోవడంతో, వారికి మెరుగైన చికిత్స కోసం సోమవారం ఉదయం రుయా ఆసుపత్రికి తరలించారన్నాడు. ఆశ్రమంలో ఉన్న మిగిలిన పిల్లలు డయేరియా బారినపడకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం పద్మావతిపురంలో ఉన్న మానసిక దివ్యాంగులు ఆశ్రమ పాఠశాలని కలెక్టర్ తనిఖీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల శాఖ అధికారి శ్రీనివాస్, ఆశ్రమ పాఠశాల జనరల్ సెక్రెటరీ బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపల్ మురళీకృష్ణ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పట్రపల్లెలో ఇంట్లో చోరీ

### -9 సవర్లు బంగారు, నగదు చోరీ చేసిన దొంగలు

తవణంపల్లె, జూలై 9 ప్రభాతవార్త:



పట్రపల్లెలో చోరీ సంఘటనలో పరిశీలిస్తున్న ఎస్సై

పట్టపగలు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి బం గారు నగలు, నగదును దోచుకెళ్ళిన సంఘటన మండలంలోని పట్రపల్లెలో సోమవారం చోటు చసుకుంది. ఈవిషయం మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై అనిల్ కుమార్ కథనం మేరకు వివరాలిలావున్నాయి. పట్రపల్లెకు చెందిన ఎ.గుర్రప్ప అనే వ్యక్తి ఇంటికి తాళాలు వేసి భార్యతో కలసి సోమ వారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు పొలం పనుల నిమిత్తం వెళ్ళారు. వారు సాయంత్రం వరకు అక్కడే వుండి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఈనేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి అందులో దాచి వుంచిన 9 సవర్లు బంగారు, కొంత నగదును చోరీ చేసి తీసుకెళ్ళారు. ఈవిషయాన్ని గుర్రప్ప మంగళవారం ఉదయం కనుగొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో ఎస్సై అనిల్‌కుమార్ వెంటనే సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే చిత్తూరు నుండి వచ్చిన క్లూస్ టీం బృందం సంఘటనా స్థలంలో

# ఎస్‌డికె నగర్‌లో భారీ చోరీ

### చెన్నై వెళ్ళిన యువకుని ఇంటిలో దొంగతనం
### వరుస చోరీలతో జనం భయం భయం

శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్‌డికె నగర్‌లోని 7వ లేన్‌లో భారీ చోరి జరిగింది. చెల్లి పెళ్ళికి దాచిపెటుకున్న నగదు, నగలు వారు చెన్నై వెళ్ళటంతో దొంగల పాలైంది. బాధితులు అందించిన సమాచారం మేరకు మంగళవారం టూ టౌన్ పోలీసులు,క్లూటీంలు పరుగులు తీసాయి. చుట్టుపక్కల నివాశస్థులు ఈ సంఘటనతో ఆందోళనకు గురౌతున్నారు.ఈ ప్రాంతం పక్కనే టూటౌన్ పోలీసు స్టేషన్ ఉంది. ఎస్‌డికె నగర్‌లో జరుగుతున్న వరుస చోరీలతో భయబ్రాంతులౌతున్నారు.

**పోలీసు స్టేషన్లు పెరిగాయి:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం పోలీసు స్టేషన్ల సంఖ్యను పెంచారు.పట్టణానికి రెండుగా విభజించారు.కావాల్సినంత సిబ్బందిని నియమించారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో భద్రత ప్రశ్నార్ధకంగా మారింది. పోలీసులు చేపడుతున్న సంస్కరణలు ఏమౌతున్నాయో ఏమో కాని స్టేషన్‌కు సమీపంలోని ఎస్‌డికె నగర్‌లో భద్రత ప్రశ్నార్థమైంది. ఈ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఖాళీ ప్రాంతాలు బార్లుగా మారుతున్నాయి.గస్తీపోలీసుల పెట్రోలింగ్ చేస్తున్నా నేరాలు అదుపు కావటం లేదంటే ఇక్కడ శాంతి భద్రతల పరిస్తితి అర్థమౌతుంది. మంగళవారం అందిన సమాచారం మేరకు అలీం ఆయన తల్లి ఎస్‌డికె నగర్‌లోని 7వ లేన్‌లో నివాసముంటున్నారు. అలీం చెల్లులు చెన్నైలో బంధువుల ఇళ్ళ వద్ద ఉంటున్నారు. అలీం చెల్లికి వివాహం ఖరారు కావటంతో చర్చలకు చెన్నై వెళ్లినట్లు చెబుతున్నారు.వారు ఇంటిలో లేని సమయంలో గుర్తించిన దొంగలు ఇంటి తలుపులు పగుల గొట్టి చోరికి పాల్పడ్డారు.ఇంటిలో వివాహానికి సంబంధించి దాచిపెట్టిన 40 సవర్ల బంగారు రూ.3.5లక్షల నగదు,ఒక కిలో వెండి ని దొంగలు చేజిక్కించుకొని వెళ్ళారు. ఉదయం ఇరుగుపొరుగు గమనించి తలుపులు తీసి ఉండటం ఎవ్వరూ కనబడక పోవటంతో చరవాణి ద్వారా అలీంకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా బీరువాల్లో దాచి ఉంచిన సొమ్ములు నగలు దొచుకుని వెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన సమాచారం తెలిసిన వెంటనే టూటౌన్ పోలీసు సిఐ రారాజు, ఎస్ఐ విజయభాస్కర్‌రాజు వారి సిబ్బంది క్లూటీంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

## కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ఉత్తర్వులు !!

### - ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఐఎఎస్ అధికారి వికాస్ మర్మత్ నియామకం !!

కుప్పం, జూలై 9 ప్రభాతవార్త



కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)ను ఏర్పాటు చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కుప్పం కడకు నూతన ప్రాజెక్ట్ డైరెక్టరుగా 2019బ్యాచ్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి వికాస్ మర్మత్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వికాస్ మర్మత్ ప్రస్తుతం నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ కమీషనరుగా పనిచేస్తున్నారు. ఈయనకు తాజాగా కుప్పం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించారు. కడ పరిధిలో కుప్పం మున్సిపాలిటీ, కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతి పురం మండలాలు ఉంటాయి. 17 ప్రభుత్వ శాఖలకు సంబంధించి కడ పరిధిలో కార్యకలాపాలను పర్యవేక్షించనున్నారు. కాగా కడకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 19 పోస్టులను సైతం మంజూరు చేసింది. డిప్యూటీ కలెక్టర్ స్థాయి కలిగిన అడిషనల్ పిడి, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ పోస్టులు ఒక్కోటి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు రెండు వంతున మంజూరు

## పకడ్బందీగా కొత్త ఇసుక విధానం

### - ఇసుక స్టాక్ యార్డును పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు టౌన్, జులై 9 ప్రభాతవార్త:



నూతన ఇసుక విధానం-2024ను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు రూరల్ మండలం దిగువమాసపల్లి ఇసుక స్టాక్ యార్డును మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారులు యుపిఐ ద్వారా నగదు చెల్లించాలని, వినియోగదారులు చెల్లించిన మొత్తంకు రసీదు ఇవ్వబడుతుందన్నారు. ఇసుక డిపోలు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పని చేస్తాయని ఈ సమయంలో వినియోగదారులు డిపోల నుండి ఇసుక పొందవచ్చునన్నారు. ఇసుక డిపోల్లో మొదట వచ్చిన వారికి మాత్ర మే మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, నగదు రూపంలో చెల్లింపులు అనుమతించబడవని స్పష్టం చేశారు. అలాగే విని యోగదారులు ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, వాహనం నెంబర్, డెలివరీ అడ్రస్ ఇచ్చి ఇసుకను పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు శ్రీనివాసులురెడ్డి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆణివార ఆస్థానానికి ముగిసిన మహాయజ్ఞం

### -భక్తితో ఆలయ శుద్ధి



తిరుమల,జులై 9 ప్రభాతవార్త

రానున్న మంగళవారం సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం పురస్కరించుకుని మంగళవారం ఉదయం గోవిందుని ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం మహాయజ్ఞంలా ముగిసింది. ఆలయ అర్చకులు, అధికారులుఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు. తొలిసారిగా టిటిడి ఈఓ జె.శ్యామలరావు దంపతులు పాల్గొని తమవంతుగా భక్తితో ఈ కార్యక్రమంలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# దేవాలయాల్లో కదలిన మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు

### దేవాదాయశాఖ మంత్రి సమీక్ష
### శ్రీకాళహస్తి మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలను పరిశీలించిన మంత్రి

శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఐదేళ్ళ కిందట మూల పడింది. 2016లో అప్పటి ముఖ్యమంత్రి ఇప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు 2025 నాటికి ఆలయాల రద్దీని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో మాస్టర్ ప్లాన్ అమలుకు నిర్ణయించారు. ఆ మాస్టర్ ప్లాన్‌లకు సంబంధించి ప్రస్తుత దేవాదాయశాఖ మంత్రి ఆనం రాం నారాయణ రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో 8దేవాలయాల ఇఓలు, ఇంజనీరింగ్ సిబ్బందితో చర్చించారు.శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్‌లో మొదటి దశలో భూసేకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. సుమారు రూ.100కోట్లతో 199 ఇళ్లతో పాటు 3.54 ఎకరాల భూమిని సేకరించారు. రెండవ దశలో రూ.84కోట్లతో నిర్మాణాత్మక పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు రూపొందించి వివిధ కమిటీల పరిశీలన అనంతరం టెండర్ స్థాయికి తెచ్చారు. ఇందులో బిక్షాల గాలిగోపురం నుంచి క్యూలైన్లు,షాపింగ్ కాంప్లెక్సు భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, క్యూలైన్లలో మౌళిక సదుపాయాలు పొందుపరచారు. 2019లో ప్రభుత్వం మారటంతో శ్రీకాళహస్తీశ్వరాలయ మాస్టర్ ప్లాన్‌కు 'గ్రహణం' పట్టింది. ప్రభుత్వం రాష్ట్రంలోని 8 దేవాలయాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ముంబైకి చెందిన కన్సల్టెన్సీకి ప్రణాళికల రూపకల్పనకు బాధ్యత అప్పగించారు. ఆ కన్సల్టెన్సీ ఐదేళ్ళ పాటు పరిశీలనలకే పరిమితమయ్యారు.

**మంత్రి ఆనం పరిశీలన:**

రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు సంబంధించి అమలు జరుపుటకు ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్‌లను అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆలయాల ఇఓలో సమీక్షించారు. కన్సల్టెన్సీల పని తీరును పరిశీలించారు. ఈ నేపద్యంలో శ్రీకాళహస్తి మాస్టర్ ప్లాన్‌కు సంబందించిన ప్రతిపాదనలు, పరిశీలనలు, వివిధ కమిటీలు, నిపుణుల అభిప్రాయాల నివేదికను ప్రస్తుత పరిస్థితిని ఆలయాధికారులు మంత్రికి వివరించారు.అన్ని పరిశీలించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్థానిక శాసనసభ్యుడుతో చర్చిద్దామని సూచించినట్లు తెలిసింది.మంత్రి సమీక్షలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన ఇఓ మూర్తి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇఇ కిషోర్‌లు పాల్గొన్నారు.



మాస్టర్ ప్లాన్ దృశ్యం(ఫైల్‌ఫోటో)

# ఉచిత ఇసుక విధానంలో కార్మికుల జీవితాల్లో వెలుగులు

## - ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూలై 9 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం భవన నిర్మాణ రంగ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైకాపా పాలనలో ఇసుక బంగారంకంటే ప్రియంగా మారిందన్నారు. నేషనల్ గ్రీన్ ట్రెబ్యూనల్, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఇసుక పాలసీని అమలు చేస్తోందన్నారు. వైకాపా పాలనలో ఇసుక ధరలను 4-6వేలకు పెంచడంతో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. జయప్రకాష్ వెంచర్స్‌కు ఇసుక లీజులు ఇచ్చి దాదాపు 50వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారన్నారు. వైకాపా ఇసుక విధానంతో పది లక్షల కుటుంబాలు ఉపాధి కోల్పోయారన్నారు. హంద్రీ-నీవా, ఎన్టీఆర్ సుజల, గ్రామీల్లో రోడ్లు, డ్రైనేజీలకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. కుప్పం పట్టణ ను మోడల్ టౌన్, మున్సిపాలిటీగా మార్చేందుకు ఎపియుఐఎంఎల్ బృందం పర్యటించి ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోల్పోయినా పేదలకు ఉచిత ఇసుక ఇవ్వాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించడం హర్షణీయమన్నారు. కుప్పంలో గ్రామాల అభివృద్ధికి గ్రామ వికాస పత్రాలు రూపొందించామని వాటిని సిఎం చంద్రబాబు ఆదేశాలతో అమలు చేస్తామన్నారు. సమావేశంలో చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ వెంకటేష్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు సత్యేంద్రశేఖర్, కన్నన్, మంజు, సోమశేఖర్, ఆర్ముగం, సుబ్బు, రవి, మణి, మురళి, సంతోష్, ఎవి రవి, బగ్గిడి వెంకటేష్, వల్లెప్ప పాల్గొన్నారు.

## ఎంపీ దగ్గుమళ్ళను కలిసిన కమిషనర్ అరుణ

చిత్తూరు టౌన్, జూలై 9 ప్రభాతవార్త:



చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. చిత్తూరు ఎంపీ కార్యాలయంలో వున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావును కమీషనర్ డాక్టర్ జె.అరుణ కలిసి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వైకాపాకు ఊడిగం చేసిన అధికారులను వెంటనే బదిలీ చేయాలి

తవనంపల్లె, జూలై 9 ప్రభాతవార్త:

వైకాపాకు ఊడిగం చేసిన అధికారులను వెంటనే బదిలీ చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సప్తగిరి ప్రసాద్ రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మంగళగిరిలో లోకేష్‌ను ఆయన స్వగృహంలో కలుసుకుని జిల్లాలో వైకాపాకు ఊడిగం చేసినటువంటి అధికారులు ఇంకనూ విధుల్లో కొనసాగుతున్నారని, వారిని తక్షణం బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గత ఎన్నికల్లో వైకాపా కార్యకర్తల్లా పనిచేసిన అధికారులపైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలపైన నమోదు చేసిన తప్పుడు కేసులను న్యాయపరమైన చిక్కులను అధిగమించి ఎత్తివేయాలని నారా లోకేష్‌కు సప్తగిరి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## కాణిపాకం జడ్పీ హైస్కూల్ స్థల కబ్జాను అడ్డుకోండి

కాణిపాకం, జూలై 9 ప్రభాతవార్త:

కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని కబ్జా చేసి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని జనసేన నాయకులు కాణిపాకం ఆలయ ఉభయదారుడు రాజ్‌కుమార్ మంగళవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలసి ఫిర్యాదు చేశారు. కాణిపాకం ఉన్నత పాఠశాలకు చెందిన 362 సర్వే నెంబర్‌లో వున్న స్థలంను అగరంపల్లెకు చెందిన ఓ వ్యక్తి కబ్జాచేసి అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీనిపై విచారించి అక్రమ కట్టడాల నిర్మాణాలను ఆపాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఎంపీ దగ్గుమళ్ళను కలసిన కాణిపాకం ఆలయ అధికారులు

కాణిపాకం, జూలై 9 ప్రభాతవార్త:



చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్‌రావును మంగళవారం కాణిపాకం ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్తూరులోని ఎంపీ క్యాంపు కార్యాల యంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు, వేదపండితులు స్థానిక టీడీపీ నాయకులతో కలసి ఎంపీని కలసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను, చిత్రపటాన్ని, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందించారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళ మధ్యనే మురుగునీరు

### ఆందోళనలో గ్రామస్తులు



దిగువపల్లి(చౌడేపల్లి), జూలై 9 ప్రభాతవార్త

ఇళ్ళ మధ్యనే మురుగునీరు వుండటంతో చుట్టుపక్క లున్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దిగువపల్లి పంచా యతీ అప్పినేపల్లిలో బోయ కొండ ప్రధాన రహదారికి అతి సమీపంలో మురుగు నీరు దర్శనమిస్తోంది. ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిల్వ వుండి దోమలు, ఈగలకు నిలయంలో మారాయి. అంటు వ్యాధు లు ప్రబలుతున్న ప్రస్తుత సమయంలో వ్యాధికారకాలైన దోమల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు. అంతే కాకుండా మురుగునీటికి కూతవేటు దూరంలోనే ప్రాథమిక పాఠశాల వుంది. విద్యార్థులు సైతం మురుగునీటి వల్ల ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధిలో నిల్వఉన్న మురుగునీటిని తొలగించి, పారిశుద్ధ్యం చర్యలు పాటించాలి గ్రామస్తులు కోరుతున్నారు.

## వైకాపానేత కుటుంబానికి ఆర్థికసాయం

కుప్పం, జూలై 9 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కుమారుడు గణపతి కుటుంబానికి వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందించిన యాభైవేల చెక్కును మంగళవారం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అందజేశారు. ఇటీవల జరిగిన ఘర్షణల్లో ప్రత్యర్థులు గణపతి, అతని అనుచరులపై దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో గణపతి తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయాన్ని జిల్లా వైకాపా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్‌లు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాజీ సిఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వైకాపా అధ్యక్షులు వైఎస్ జగన్ గణపతి కుటుంబానికి యాభైవేల సాయం ప్రకటించి చెక్కును అందించారు. కార్యక్రమంలో ఆంజనేయగుడి మాజీ ఛైర్మన్ కుమరేష్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## టిడ్కో లబ్దిదారులకు న్యాయం చేస్తాం

### - ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

చిత్తూరు టౌన్, జులై 9 ప్రభాతవార్త:



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్ళ లబ్దిదారులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. మేయర్ అముద, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణలతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు పూనేపల్లి వద్ద వున్న టిడ్కో ఇళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గృహ సముదాయంలో వున్న గృహాలు, ఇతర మౌళిక సదుపాయాలను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. పెండింగ్ పనులపై టిడ్కో అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సత్వరం పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ 2017-18 సంవత్సరంలో పేదలందరికీ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని ఉద్దేశంతో టిడ్కో గృహాలకు శ్రీకారం చుట్టి లబ్దిదారులకు పట్టాల పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం టిడ్కో సముదాయంలో 2 వేల గృహాల్లో పెండింగ్ పనులు వున్నాయని ఈ పనులను పూర్తి చేసి త్వరలోనే లబ్దిదారులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన గృహాల్లో సైతం పెండింగ్ పనులను త్వరితంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఎసిఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడుగా పగడాల నరసింహులు

చౌడేపల్లి, జూలై 9 ప్రభాతవార్త



భారత అవినీతి నిరోధక పౌండేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడుగా చౌడేపల్లికి చెందిన పగడాల నరసింహులు నియమితులయ్యారు. మంగళ వారం విజయవాడలోని రాష్ట్రశాఖ ప్రధాన కార్యాలయంలో విజిలెన్స్ క్రైమ్ ఇన్‌ఛార్జీ సామర్ల కాశీవిశ్వనాథ్ చేతుల మీదుగా నియామక పత్రాన్నందుకొన్నట్లు నరసింహులు తెలిపారు. జిల్లాలో నూతన కార్యవ ర్గాన్ని ఎన్నుకొని తద్వారా సమాజాన్ని పట్టిపీడిస్తున్న అవినీతిపై పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు.

## గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి

### - ఎంపిడీఓ అబ్దుల్ రహీం

పెద్దపంజాణి, జూలై 9 ప్రభాతవార్త :



మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాదులు ప్రబలకుండా పంచాయతీ కార్యద ర్శులు చొరవచూపాలని ఎంపిడిఓ అబ్దుల్‌రహీం ఆదేశించారు. మంగళవారం మండలంలోని లింగాపురం పంచాయతీలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. తొలుత గ్రామసచివాలయాన్ని తనిఖీచేసి హాజరైన ఉద్యోగుల వివరాలు, సచివాలయరికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న పారిశుద్యపనులను పరిశీలించారు. వర్షాకాలం కావడంతో ఎక్కడా జనావాసాల్లో నీరునిల్వలేకుండా చూడాలని ఆదేశించారు. నీటినిల్వఉంటే దోమలసంచారం పెరిగి తద్వారా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ ప్రభలే అవకాశముందన్నారు. పంచాయతీ, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో పారిశుధ్యానికి మెదటిప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే మంచినీటి ట్యాంకులను, పరసరప్రాంతాలను శుబ్రంచేయించాలని ఎంపిడిఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యకదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఇసుక నూతన విధానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం జూలై 9 ప్రభాతవార్త :



సూళ్ళూరుపేట నియోజక వర్గంలోని దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు సమీపంలో ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపడుతున్న ఇసుక నూతన స్టాక్‌పాయింట్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా నూతన ఇసుక పాలసీని తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వ భవనాలు, ప్రజలు గృహ నిర్మాణాలకు మాత్రమే ఇసుకను వినియోగించుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాలకు ఇసుకను అక్రమ రవాణాకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇసుక సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీఅధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, ఆర్‌డిఓ చంద్రముని, డిప్యూటి తహసిల్దార్ గోపిరెడ్డి, బందిలి ఉదయ్‌కుమార్, చంచి విజయ్‌కుమార్, ఎస్సై తిరుమలరావు, గనులశాఖ అధికారులు ఉన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే

సూళ్ళూరుపేట, జూలై 9 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.వెంకటేశ్వర్‌ను మంగళ వారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మర్యాద పూర్వకంగా కలిశారు. సూళ్లూ రుపేట నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్క రించేందుకు సహకరించాలని ఆమె విన్నవించారు. ఇందుకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నేతలు ఆకుతోట రమేష్, షేక్ రఫి, విజయకుమార్ నాయుడు, శ్రీనివాసులునాయుడు, నెలవల రాజేష్, సంచి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొబ్బరి తోటల తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

కుప్పంరూరల్, జూలై 9 ప్రభాతవార్త



కొబ్బరి తోటల తెగుళ్లను ఆశించే తెగుళ్లను రైతులు సకాలంలో నివారించాలని ఉద్యానవన అధికారి డింపుప్రియశ్రీ సూచించారు. పైపాళ్యంలో కొబ్బరిచెట్లకు ఆశించే నల్లముట్టే పురుగుల నివారణపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. అలాగే రూట్ ఫీడింగ్ గురించి వివరించారు. పురుగు ఆశించి ఎండిన ఆకును కాల్చివేయాలన్నారు. మోనోక్రోటిఫాస్ మందు పది మిల్లీలీటర్లను పది మిల్లీలీటర్ల నీటిలో కలిపి చెట్ల వేరుకు ద్రావణం కలిపి కట్టాలన్నారు. కార్యక్రమంలో విహెచ్ఎ ఆస్మిన్, రైతులు పాల్గొన్నారు.

# తడకండ్రిగలో పారిశుధ్యం పనులు అంతంతమాత్రం

తడ, జూలై 9 ప్రభాతవార్త



పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తడకండ్రిగలో పలుచోట్ల పరిశుభ్రత పాటించడం లేదు. పంచాయతీ వారు రోడ్ల మీద శ్రద్ధ లేకపోవడంతో నాలుగు చినుకులు పడినా మురుగునీరు నిలిచిపోతోంది. పేరుకు తగ్గ పంచాయతీ అయినప్పటికీ అధికారులు పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికితోడు ఇక్కడ మండల పరిషత్ కార్యాలయంలో ఎప్పుడు ఏ అధికారి ఏ విధులు నిర్వహిస్తారో తెలియక పంచాయతీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన గతంలో చోటుచేసుకుంది. అయినప్పటికీ కొందరు అధికారులు పనుల విషయంలో జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారడంతో తమకు అనుకూలమైన గ్రామాన్ని, సచివాలయాన్ని ఎంపిక చేసుకునేందుకు పోటీలు పడుతున్నారు తప్ప పలు గ్రామాల అభివృద్ధి, పారిశుద్ధ్యం పనులపై దృష్టి పెట్టడం లేదని పలువురు అంటున్నారు. తడ, తడకండ్రిగ జంట పంచాయతీలలో ఇటీవల అపరిశుభ్రత పేరుకుపోవడంతో పలువురు రోగాల బారిన పడ్డారు. అయినప్పటికీ స్పందన అంతంతమాత్రమే కావడంతో స్థానికులు ఈ పాలకవర్గాల పనితీరును కూడా ప్రశ్నిస్తున్నారు.

### 12న తడ మండల సర్వసభ్య సమావేశం

ఈ నెల 12న తడ మండల ప్రజా పరిషత్ 12వ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ పేరుపై మంగళవారం ఒక ప్రకటన వెలువడింది. మండలంలో సమస్యలు మాట్లాడుకునేందుకు ఈ సమావేశానికి సభ్యులంతా హాజరు కావాల్సి ఉంది. ప్రభుత్వం మారిన తర్వాత కొందరు ప్రజాప్రతినిధులు అధికార పార్టీలోకి ఫిరాయిస్తారన్న అనుమానాల నేపథ్యంలో ఈ సర్వసభ్య సమావేశంపై పలువురి దృష్టి కేంద్రీకృతమైంది.

## గ్రానైట్ కంకర ఫ్యాక్టరీ వద్ద గ్రామస్తుల ఆందోళన

### - పనులు నిలిపేయాలని డిమాండ్.. రోడ్డు తవ్వేసిన వైనం !!

కుప్పంరూరల్, జూలై 9 ప్రభాతవార్త



మండలంలోని మిట్టపల్లి పంచాయతీ ఆవులనత్తం సమీపంలో ఉన్న లింగాపురం వద్ద గల గ్రానైట్ కంకర ఫ్యాక్టరీ వద్ద మంగళవారం గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సమీపంలో ఉన్న క్వారీలో భారీ పేలుళ్లతో గ్రానైట్‌ను పగలగొడుతున్నారని తద్వారా ఇళ్లపై రాళ్లు దూసుకురావడంతో పాటు సమీపంలో ఇళ్ల గోడలు సైతం బీటలు వారుతున్నాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. కాగా గ్రానైట్ కంకర పరిశ్రమకు వెళ్లే మట్టి రోడ్డును గ్రామస్తులు వాహనాలు వెళ్లకుండా ఉండేందుకు తవ్వేశారు. గత ంలో సైతం ఈ కంకర పరిశ్రమ నిలుపుదల చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు పేర్కొన్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోయారు. గ్రానైట్‌ను కంకర చేసే పనుల్లో భాగంగా వెలువడే దుమ్ము, ధూళి సమీపంలో ఉన్న పంట పొలాలపై పడుతున్న నేపథ్యంలో పొలాల్లో పంటలు సైతం సాగయ్యే స్థితి లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంగా పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సమాచారం.

## బిఆర్‌డి ఆస్పత్రిలో ఉచిత ఐవిఎఫ్ కౌన్సిలింగ్

### - ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు

కుప్పం, జూలై 9 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సంతానం లేని దంపతుల కోసం ఐవిఎఫ్ కౌన్సిలింగ్ ఈనెల 14వతేది ఆదివారం బిఆర్‌డి ఆస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు తెలిపారు. సంతానోత్పత్తి వైద్య నిపుణులు అయిన డా॥ లావణ్య, డా॥ హరిత మండవలు సంతానం లేని దంపతులకు కౌన్సిలింగ్‌తో పాటు స్క్రీనింగ్ నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంకు హాజరయ్యేవారికి ఉచిత రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ సౌకర ్యం కలదని తెలిపారు. సంతానం లేని దంపతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 7729028405, 9398631629నెంబర్లను సం ప్రదించాలన్నారు.

## పెళ్లకూరు మండల అభివృద్ధికి అందరు సహకరించాలి

### - సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

నాయుడుపేట (పెళ్లకూరు), జూలై 9 ప్రభాతవార్త

పెళ్లకూరు మండలాన్ని అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆమె కోరారు. మంగళవారం పెళ్లకూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తే తాను నిధులు మంజూరు చేయిస్తానని ఆమె అన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు జిల్లా మంత్రుల సహకారంతో కృషి చేస్తామన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అందరూ సహకరించాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇసుక అక్రమ రవాణాకు తావులేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ పోలంరెడ్డి, జడ్పీటీసీ ప్రిస్కిల్లా మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, సంచి కృష్ణయ్య, వి.శేఖర్‌నాయుడు, వి.మురళీకృష్ణారెడ్డి, పి.రమేష్‌నాయుడు, మధునాయుడు, కె.శివకుమార్, నాగేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్లు వాడండి.. ప్రాణాలు కాపాడుకోండి

కోట, జూలై 9 ప్రభాతవార్త



కేంద్రప్రభుత్వం నూతనంగా అమలు చేసిన న్యాయ చట్టంపై కోట పోలీసులు సోమవారం కోట క్రాస్‌రోడ్డులో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎఎస్ఐ శోభారాణి, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ద్విచ క్ర వాహనంపై వెళ్లే వారు హెల్మె ట్ ధరించాలని, కార్లలో ప్రయా ణించే వారు సీటుబెల్టు పెట్టుకో వాలని సూచించారు. హెల్మెట్ ధరించని కారణంగా ఎంతోమంది ప్రమాదాలు జరిగి తలకు గాయాలై ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. సోమవారం నెల్లూరులో జరిగిన బైక్ ప్రమాదంలో దంపతులిద్దరూ బైక్ వెళ్లుతుండగా టిప్పర్ ఢీకొందిని భార్య తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారని భర్త హెల్మెట్ ధరించడంతో స్వల్ప గాయాతో బయట పడ్డారని చెప్పారు. బైక్‌పై ప్రయాణించే వారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని వారు సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే ఆదిమూలం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, జూలై 9 ప్రభాతవార్త: ప్రజల పక్షాన పోరాడుతున్నందుకే నియోజకవర్గ ప్రజలు రెండో సారి తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నట్టు స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. మంగళవారం సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన, ఎంపీడీవో చంద్రశేఖర్ పర్య వేక్షణలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సభను ఉద్దేశించి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోను అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేయమన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో ప్రతి పంచాయతీలోను మౌలికవసతులను మెరుగుపరచాల్సి ఉందన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలోను తాగునీరు, రోడ్లు, విద్యుత్ అవసరాలు కీలకంగా మారిందన్నారు. వీటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి పని చేస్తే ప్రభుత్వాన్ని కూడా మంచి పేరు వస్తుందన్నారు. అలాగే తాను ఇటీవల చిన్న పాండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించినప్పుడు 14 మంది సిబ్బంది ఉన్న కనీసం ఒకరు కూడా లేదన్నారు. దీనిపై సంబంధిత మెడికల్ డాక్టర్ అనితను ప్రశ్నించారు. కొందరు డీఈ స్థాయి అధికారులు సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు కావడం పట్ల ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై నివేదికను జిల్లా కలెక్టర్ పంపాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌కు సూచించారు. ఈ నేపథ్యంలో జరిగిన వ్యవసాయ శాఖ చర్చలో ఏవో మురళి మాట్లాడుతూ ఉచిత భూసార పరీక్ష కార్యక్రమంలో 540 మట్టి నమూనాలను సేకరించామన్నారు. పశు సంవర్ధకశాఖ చర్చలో డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ 75 శాతం సబ్సిడీతో మొక్కజొన్న విత్తనాలను పాడి రైతులకు పంపిణీ చేస్తున్నట్టు సభ దృష్టికి తెచ్చారు. తమ గ్రామంలో 30 ఏళ్ళ కిందట ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు తీగలు తుప్పు పట్టి పాడైపోయాయని జడేరి సర్పంచ్ బాబు సభ దృష్టికి తెచ్చారు. తమ గ్రామం మీదుగా పోతున్న ఆర్అండ్‌బీ రోడ్డు ధ్వంసం కావడంతో గ్రామం లోపల వాహనాలు రావడంతో చిన్న పిల్లలు ప్రమాద బారిన పడుతున్నట్టు సర్పంచ్ శిరీష శ్రీనివాసరెడ్డి విన్నవించారు. కాగా ఎమ్మెల్యే ఆదిమూలం సభ నుంచి లేచి వెళ్లిపోవడంతో కొన్ని శాఖల చర్చ జరగకనే సభను అర్ధాంతరంగా ముగించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రామాంజనేయులు, గంగ డీఈ ఓబుల్ దాసు, వ్యవసాయ ఏడీ సుబ్రహ్మణ్యం, ట్రాన్స్‌కో ఏడీ చంద్ర నాయక్, చెరివి ఏఈ జగదీష్, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఎంఈవో రవి, ఉపాధి ఏపీవో కిష్టయ్య, ఐసీడీఎస్ దేవ కుమారి, వెలుగు ఏపీఎం స్వర్ణలత, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సూర్యనారాయణ, దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యులు డా. గుణశేఖర్, మురళీకృష్ణ, కమ్యూనిటీ వైద్యశాల వైద్యాధికారి డా. సతీష్, ఏఎస్‌డబ్ల్యువో కృష్ణ, హాస్టల్ వార్డెన్స్ గంగాధరం, విజయకుమారి, సత్యవేడు పంచాయతీ సెక్రటరీ ముని రవికుమార్, పంచాయతీ సర్పంచ్‌లు మంజుల, రమేష్, రవిరెడ్డి, మునస్వామి, శివరంజని తదితరులు పాల్గొన్నారు.

## సూర్యనారాయణపై అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి: ఎపిజిఇఎ

తిరుపతి టౌన్, జూలై 9ప్రభాతవార్త: ఎపిజిఇఎ రాష్ట్రఅధ్యక్షుడు కెఆర్ సూర్యనారాయణపై గతంలో నమోదైన కేసులున్యాయపూరితమైనవి కాదని, ఆయన చేసిన పోరాటాలు ఆయన వ్యక్తిగత కోసం కాదని ఎపిజిఇఎ తిరుపతి జిల్లాఅధ్యక్షుడు ఎన్నగాని తులసీరామ్ తెలిపారు. ఆయన అనాదు అవలంభించిన పోరాట విధానాలన్నీ పూర్తిగా రాజ్యాంగబద్ధమైన పోరాటలన్నారు. ఆయనపై అభియోగాలు, కేసులు నమోదు ఉపసంహరించుకునేలా ప్రభుత్వం చొరవ చూపాలని, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంఘం, తిరుపతి జిల్లాశాఖ విజ్ఞప్తి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు తులసీరామ్, ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, కార్యదర్శి సుబ్బరాయుడు, కోశాధికారి మధుబాబు, నాగేశ్వరరావు, కీరం, కోటేశ్వరరావు, రవికుమార్, మనోజ్ తదితరులు పేర్కొన్నారు.

## కేవీబీ పురం మండలంలో విష జ్వరాలు

### -సదాశివపురంలో డయేరియా లక్షణాలు



శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త: కెవిబీపురం మండలం సదాశివపురంలో డయేరియా లక్షణాలు కలిగి పలువురికి విష జ్వరాలు సోకిందని గ్రామ ప్రజలు వాపోతున్నారు. పారిశుద్యం లోపం కారణంగా పలువురికి విష జ్వరాలు సోకి మంచాన పడ్డారని గ్రామస్తులు వాపోతున్నారు. మురుగు కాలువలు శుభ్రం చేయక చెత్తాచెదారం పేరుకుపోయి వీధులపై మురికి నీరు వెళుతుండడంతో వాటిపై దోమలు వాలి అంటు రోగాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. దళితవాడలో ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించి వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి, అధికారులకు తెలిపినా ఎవరు పట్టించుకోవడం లేదని వారు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సదాశివపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## న్యాయం కావాలి




తిరుపతి కార్పొరేషన్, జులై 9 ప్రభాతవార్త : కిరణ్‌ను నేను ప్రేమించి పెద్దలను ఎదిరించి 2005లో ప్రేమ వివాహం చేసుకున్నామని సంధ్య ఒక మహిళ తనకు న్యాయం చేయాలంటూ తిరుపతి ప్రెస్‌క్లబ్‌ని మంగళవారం ఆశ్రయించింది. విలేఖరుల సమావేశంలో సంధ్య మాట్లాడుతూ మాకు ఇప్పటికే మగ బిడ్డకు జన్మించాడని ఆమె తెలిపింది. మా దాంపత్య జీవితం గత 19 ఏళ్ళుగా సజావుగా సాగిందని ఆమె తెలిపింది. ఇటీవల కాలంలో నా భర్త కిరణ్ ఇతర వ్యవసనాలకు బానిసై, నాపైనా, బిడ్డపైనా దాడి చేస్తున్నాడని ఆరోపించింది. తరువాత మా ఇద్దరి మధ్య మనస్పర్ధలు వచ్చి నేను పుట్టింటికి వెళ్ళానని తెలియచేసింది. ఈ తరుణంలో నాభర్త కిరణ్ మరో వివాహం చేసుకున్నాడని ఆమె చెప్పింది. విషయం తెలుసుకున్న నేను నా భర్తని నిలదీయగా అతను నాకు సమాధానం చెప్పలేదంది. నాకు దిక్కుతోచక దిశ పోలీసుస్టేషన్‌లో నాకు న్యాయం చేయాలంటూ కంప్లైంట్ ఇచ్చినా నాకు వారు న్యాయం చేయలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. నాకు న్యాయం జరగాలనే ఆలోచనతో ప్రెస్‌క్లబ్‌ని ఆశ్రయించడం జరిగిందని ఆమె వెల్లడించింది. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు జోక్యం చేసుకుని నాకు నా బిడ్డకి న్యాయం చేయాలని ఆమె కోరారు.

## టెండర్ల మాయా జాలం: సెక్యూరిటి సిబ్బందికి సంకటం!



శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో పని చేస్తున్న భద్రతా సిబ్బందికి (సెక్యూరిటి) నాలుగు నెలలుగా జీతాలు అందని వైనం చోటు చేసుకుంది.గత పాలకుల జోక్యం, అస్మదీయులకు టెండర్లుతో వ్యవస్థ కుప్ప కూలింది. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో టెండర్ల విధానం కుదేలలైంది.రాష్ట్రంలో ప్రభుత్వం మారినా స్థానికంగా నాయకుడు మారినా దేవస్థానంలో పరిపాలనా తీరు, టెండర్ల విధానంలో మార్పు రాకపోవటం గమనించదగ్గ విషయం. సెక్యూరిటి సిబ్బంది టెండర్ అయోమయం,ఫలసరకుల టెండర్ ఎప్పుడో తెలియదు. ఇక కార్‌పార్కింగ్ టెండర్ మాయాజాలంగా మారింది. అధికారులు నిబంధనల ప్రకారం పని చేస్తే ఈ సమస్య ఉండదు. అధికారులు పాలకుల దయాదాక్షిణ్యాలతో పరిపాలన సాగిస్తే వ్యవస్థ నవ్వుల పాలౌతుందనటానికి శ్రీకాళహస్తీశ్వరాలయ పాలనే నిదర్శనం.

**సిబ్బంది జీవితాలు అయోమయం:**

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం చేసుకుంటే మంచి జరుగుతుందని దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు నమ్ముతారు. ఇక్కడి ఆలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటే నివృత్తి కల్గుతుందని నమ్మి వేలాది మంది ప్రతి రోజూ వస్తున్నారు.ఇక్కడి వాయులింగేశ్వరుని దర్శనంతో సకాల దోషాలు తొలగి సుఖశాంతులు కల్గుతుందనే నమ్మకం ప్రగాఢంగా ఉంది. అయితే ఇక్కడి పాలన తీరు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యమేస్తుంది.సెక్యూరిటి సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలందని పరిస్థితి.శ్రీకాళహస్తి దేవాలయంలో సెక్యూరిటికి సంబంధించి ప్రైవేటు ఏజెన్సి ద్వారా టెండర్లు పిలిచి నియమిస్తారు. ఇక్కడ ఉన్న పాయింట్లకు రెట్టింపు సిబ్బంది ప ని చేస్తున్నారు.కారణం రాజనీయ జోక్యం. వారి మనుషులకు ఉపాధి కోసం ఏ పార్టీ అధికారంలో ఆ పార్టీ తమ మనుషులకు ఇక్కడ సెక్యూరిటి ద్వారా ఉపాధి కల్పించుకుంటున్నారు.గత పాలనలో ఒంగోలుకు సంబంధించిన ఓ ఏజెన్సి పేరుతో అధికార పార్టీతో అంటకాగిన ఓ అనుచరునికి అప్పగించారు. ఎన్నికలకు ముందు టెండర్ కాలం ముగిసింది. ముందు జాగ్రత్తగా అధికారులు టెండర్ పిలిచి ఫిక్స్ చేసి ఉండాలి.కానీ అలా చేయలేదు. తరువాత రెండు నెలలు ఎన్నికల కోడ్ అంటూ సాగదీసారు. అధికారులు కూడా మళ్లీ వైకాపా ప్రభుత్వమే వస్తుందని భావించారు.ఎన్నికల తరువాత పది రోజుల ముందు టెండర్లు పిలిచారు.కానీ సాంకేతికంగా ఈ టెండర్ క్వాలిఫై కాలేదు.దాంతో ఇక్కడ పని చేస్తున్న పరిస్తితి అగమ్యగోచరంగా మారింది.

**అధికారులు పట్టించుకోరు!**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఒంగోలు కాంట్రాక్టర్ పేరుతో సెక్యూరిటి టెండర్‌ను దక్కించుకున్న నాయకుడు సెక్యూరిటి సిబ్బందికి నాలుగు నెలలు జీతాలు చెల్లించాల్సి ఉంది.ఆయన శ్రీకాళహస్తికి రారు. ఆయన బినామిగా పని చేస్తున్న సబ్ కాంట్రాక్టర్ పట్టించుకోవటం లేదు.ఒక వేళ కనబడినా బిల్లులను పెట్టడం లేదు. నిరుపేదల వద్ద పనులు చేయించుకుంటున్న అధికారులు వారి బాధలను పట్టించుకోవటం లేదు.టెండర్ గడువు ముగిసిన తరువాత సెక్యూరిటిగా పని చేస్తున్న వారికి ఎవరు జీతాలు చెల్లించాలి? కాంట్రాక్టర్? లేక దేవస్థానమా? అనేది సందిగ్ధంగా మారింది.గతంలో ఆలయానికి వచ్చే పార్టీలను తిప్పుకుంటూ పాతికో పరకో సంపాదించుకునే సెక్యూరిటికి ప్రస్తుతం సంస్కరణల కత్తి మెడపై పడింది.దాంతో ఆర్థికంగా అవస్తలు పడుతున్నారు.ఓ వైపు కుటుంబ పోషణ మరో వైపు పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమ య్యాయి. పిల్లల ఫీజులు చెల్లించాలి! మరి ఈ పరిస్థితిలో ఏం చేయాలి శివయ్యా! అంటూ కొలువు చేస్తున్న వారు కములు తున్నారు.

## కుమారస్వామికి షోడషాభికాషాలు

శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మంగళవారం పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం, శ్రీకాళహస్తీశ్వ రాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి,ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా తేరువీధిలో వెలసిన 'షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. వందలాది లీటర్ల పాలు, పెరుగు,తేనే,విభూది,గంధం, కుంకుమ, పసుపు,సకల సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు నిర్వహించారు.చూపరులను ఇట్టు ఆకట్టుకునే రీతిలో అర్చకులు ప్రసాద్,మురళిలు తీర్చి దిద్దుతున్నారు.

## కాణిపాకం సన్నిధిలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే



కాణిపాకం, జూలై 9 ప్రభాతవార్త: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, జనసేన నాయకులు పూల ప్రభాకర్, ఎం.మునిరాజులు,రాజ్‌కుమార్, మహేస్వేరో, పూలమరి, విజయ్, యోగానంద్‌లు పాల్గొన్నారు.

## పోలీసు శిక్షణా కళాశాలకు ప్రిన్సిపాల్ భర్తీ ఎన్నటికీ!

చంద్రగిరి, జూలై 9 ప్రభాతవార్త: కళ్యాణీ డ్యామ్ వద్ద గల పోలీసు శిక్షణా కళాశాల (పిటిసి) ప్రిన్సిపాల్ పోస్టును ప్రభుత్వం ఎప్పటికి భర్తీ చేస్తుందనే ప్రశ్న వ్యక్తమవుతున్నది. ఇదివరకు ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణ గత నెల 31న పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం డిఎస్పీ శ్రీనివాసులు వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో కళ్యాణీ డ్యామ్ పిటిసి ప్రత్యేక గుర్తింపు కలిగి వున్నది. ఈ నేపధ్యంలో అత్యంత బాధ్యతాయుతమైన ప్రిన్సిపాల్ పోస్టుకు ప్రభుత్వం సమర్థవంతమైన అధికారిని నియమించడం ద్వారా శిక్షణ, పాలనాపరమైన నిర్ణయాలను సత్వరమే అమలు చేయడం సాధ్యం కాగలదని భావిస్తున్నారు.

## క్యాన్సర్‌పై గ్రామీణ ప్రజలు అవగాహన కలిగివుండాలి..!



చంద్రగిరి, జూలై 9 ప్రభాతవార్త: క్యాన్సర్ పట్ల ప్రజలు అవగాహన కలిగివుండాలని కొటాల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రియాంక, చంద్రగిరి కో లొకేటెడ్ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బొల్లినేని కుసుమ అన్నారు. స్విమ్స్ ఆధ్వర్యంలో మంగళ వారం ఐతేపల్లి, శానంబట్లలో పింక్ బస్‌ను తీసుకువచ్చి వైద్య బృందం వేర్వేరుగా క్యాన్సర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. కాన్సర్ రావడానికి గల కారణాలను వివరించి, తగిన జాగ్రత్తలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈఓ సి.ఈశ్వరయ్య, ఎంపిహెచ్‌ఎస్ ఎస్.శ్యామల, మునికుమారి, ధనలక్ష్మి, ఎస్.లలిత, మోనిక, స్వప్న, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, 104 సిబ్బంది,పిబ్బంది పాల్గొన్నారు.

## సుధీర్‌రెడ్డికి ఘన స్వాగతం

### నియోజకవర్గంలో ప్రక్షాళన తప్పదు - ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



రేణిగుంట, జూలై 9 ప్రభాతవార్త: రేణిగుంట విమానాశ్రయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి మంగళవారం ఘనస్వాగతం లభించింది. ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం చేసి మొట్ట మొదట శాసన సభ సమావేశాలకు హాజరై తొలిసారి రేణిగుంటకు చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో తెలుగు తమ్ముళ్లు ఘన స్వాగతం పలికారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో రేణిగుంట మండల టీడీపీ అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పొన్నారావు, రేణిగుంట పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు డి.పుష్పనాథం, కన్నన్‌రెడ్డి, కొరియర్ రవి, సుబ్రహ్మణ్యం, మునస్వామినాయుడు, నగరి మునెయ్య, వీరస్వామి, ఉదయకుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎయిర్‌పోర్టు పోర్టికోలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అవినీతిపై ప్రక్షాళన తప్పదన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టమన్నారు. ఏపీఐఐసీ భూములపై జరిగిన అవినీతిపై నిగ్గు తేలుస్తామన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవమన్నారు. వారికి సహకరించిన వలంటీర్ల మొదలు ప్రభుత్వ యంత్రాంగాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తరువాత రోడ్డు మార్గంలో శ్రీకాళహస్తి బయలుదేరి వెళ్లారు.

## పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



రేణిగుంట, జూలై 9 ప్రభాతవార్త: రేణిగుంట మండలం వెదళ్ళ చెరువు ఎస్టీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఐవోబీ విశ్రాంత చీఫ్ మేనేజర్ సుధాకర్ ఆర్థిక సహాయంతో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు మంగళ వారం మండల విద్యాధికారులు ఇందిరాదేవి, రంగనాథ్ సమక్షంలో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి పేరు తెచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిం చారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులను ఆషా స్వచ్ఛంద సేవా తరపున జూలియన్‌రాజు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చంద్రవర్ధిణి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్ గంగాదేవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 11న భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం

పుత్తూరురూరల్, జూలై 9 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 11వ తేదీ గురువారం ఉదయం 2.30 నుంచఇ 9 గంటల వరకు భక్తుల స్వహస్తాలతో పాలాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు ఉంటాయని వివరించారు. ఇందు కోసం బాబా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూ లైన్‌లోఏర్పాటు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ



పుత్తూరురూరల్, జూలై 9 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. పుత్తూరు పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో స్థానిక మండల వ్యవసాయ అధికారి కోదండయ్య, ఏడీఏ ఆర్.రమేష్‌రాజులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. ప్రతి డీలరు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పుత్తూరు డివిజన్, మండలంలో లైసెన్స్ లేకుండా ఎవరు కూడా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మరాదని, బ్లాక్ మార్కెట్ చేయడం, రహస్యంగా అమ్మడం ఏడల చట్ట ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ తనిఖీలో తిరుపతి ఏడీఏ ధనంజయరెడ్డి, ఏడీఏ ఎన్.పి.ఎల్లప్ప, విజిలెన్స్ అధికారి డి.జీవానందం, పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు, స్థానిక మండల వ్యవసాయ అధికారి కోదండయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## కేశవపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించండి



విజయపురం, జూలై 9 ప్రభాతవార్త: మండలంలోని కోసలనగరం పంచాయతీ కేశవపురంలో నెల రోజుల పాటు తాగునీటి సమస్య ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## తిరుత్తణి రోడ్డు వరకు సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయండి

### ఎన్‌హెచ్ పీడీకీ బూచివానత్తం గ్రామస్థులు ఫిర్యాదు



విజయపురం, జూలై 9 ప్రభాతవార్త: తచ్చూరు జాతీయ రహదారి పక్కన తిరుత్తణి నుంచి బూచివానత్తం వరకు సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని మంగళవారం బూచివానత్తంలో ఎన్‌హెచ్ పీడీ కార్తీక్‌కి ఫిర్యాదు చేశారు. బూచివానత్తం నుంచి ఎక్కువ మంది రైతులు పొలాలు జాతీయ రహదారి ఇచ్చారని, బూచివానత్తం నుంచి రోడ్డుకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, వర్షాకాలంలో గ్రామానికే పరిమితమయ్యే పరిస్థితి వస్తుందని, గ్రామస్థులకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామస్థుల కోరిక మేరకు పీడీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## మెరుగైన నెట్‌వర్క్‌కోసం

### సెల్‌టవర్లు ఏర్పాటుచేయండి -బిఎస్ఎన్ఎల్అధికారులతో తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి



తిరుపతి టౌన్,జులై 9ప్రభాతవార్త: తిరుపతిపార్లమెంట్ పరిధిలోని పలు గ్రామాల్లో మెరుగైన సెల్‌నెట్‌వర్క్‌సిగ్నల్స్ కోసం అవసరమైన చోట్ల సెల్‌టవర్లు ఏర్పాటుచేయాలని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి బిఎస్ఎన్ఎల్ అధికారులను కోరారు. వాకాడు మండలం పూడిరాయ దొరువు, తడ మండలం ఇరకం, నాగలాపురం మండలం నందనం గ్రామాల్లో నిర్మించతలపెట్టిన సెల్‌టవర్లు కోసం వైల్డ్‌లైఫ్ అనుమతులు తీసుకోవాలన్నారు. రెండు ప్రాంతాల్లో టవర్లు ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానాన్నరు. బిఎస్ఎన్ఎల్ 3జి టవర్లను 4జి టవర్లుగా మార్చే ప్రక్రియ తిరుపతినుండి మొదలుకావాలన్నారు. జనాభాకు తగ్గట్లు టవర్లు ఏర్పాటు చేసి, సిగ్నల్స్‌ను మెరుగుపరచాలని బిఎస్ఎన్ఎల్అధికారులను కోరారు. మంగళవారం ఎంపి కార్యాలయంలో బిఎస్ఎన్ఎల్అధికారులు జిఎం ,డిజిఎంలు కలిశారు.

## నారా లోకేష్‌కు శ్రీవారి ప్రసాదాలు



తిరుపతి టౌన్, జులై 9ప్రభాతవార్త: రాష్ట్రమంత్రి,టిడిపి యువనేత నారా లోకేశ్‌ను తిరుపతికి చెందిన కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ కలిశారు. మంగళవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి దుశ్శాలువతో సన్మానించారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆంజనేయ స్వామికి పూజలు



శ్రీకాళహస్తిరూరల్,జూలై 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం గుంటకింద పల్లిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి ప్రత్యేక పూజలు జరిపించారు. ఇక్కడ వెలసిన మహిమాన్విత ఆంజనేయ స్వామికి ప్రతి మంగళవారం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో బొజ్జల సుదీర్‌రెడ్డి గెలిస్తే తలనీలాలు సమర్పించు కుంటామని గ్రామానికి చెందిన కొందరు మొక్కుకున్నారు. సుధీర్‌రెడ్డి అత్యధిక మెజారిటితో గెలుపొందటంతో మంగళవారం వారు తలనీలాలు సమర్పించి పూజలు జరిపారు.ఈ పూజల్లో ఎంఎల్ఏ సతీమణి పాల్గొన్నారు. రిషితారెడ్డికి గ్రామంలో ఘనస్వాగతం పలికారు. గ్రామస్థులు ధనపాల్‌రెడ్డి, మునిరెడ్డి, మురళి, కుమార్, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

## సుధీర్‌రెడ్డికి గ్రామంలో ఘనస్వాగతం



శ్రీకాళహస్తిరూరల్,జూలై 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా గెలిచి శాసనసభ సమావేశాలతో పాటు వివిధ కార్యక్రమాలకు హాజరవటానికి వెళ్ళిన సుధీర్‌రెడ్డి మొదటి సారి నియోజకవర్గానికి అధికార హోదాలో రావటంతో ఆయనకు స్వగ్రామం ఉరందూరులో అభిమానులు, కార్యకర్తలు, చుట్టుపక్కల గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. సుధీర్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం వచ్చారు. ఆయనకు తెలుగు దేశం వర్గాలు బ్రహ్మరథం పట్టారు. గ్రామ పొలిమేరల నుంచి పూల వర్షం కురిపించారు. నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లకు జేజేలు కొడుతూ టాప్‌లెస్ జీపులో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలను పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు, మాజీ పాలసరఫరా సంఘం అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజా నాయుడు, మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షులు రంగినేని చెంచయ్య నాయుడు, తాటిపర్తి రవీంద్రరెడ్డి, పొన్నారావు, ఇతర నాయకులు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. నియోజకవర్గంలోని పార్టీ అభిమానులు గ్రామానికి చేరుకొని ఆయనకు ఘనస్వాగతం పలికారు.

## మాజీ ఎంఎల్ఏ, పిఎ గుణశేఖర్‌ల అవినీతిపై విచారణ చేపట్టాలి



శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి మరియు ఆయన పిఎ గుణశేఖర్‌రెడ్డి చేసిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఏన్‌డిఏ ప్రభుత్వం పరిపాలనను స్వాగతిస్తున్నామని తెలిపారు. శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి మరియు ఆయన పిఏ గుణశేఖర్‌రెడ్డిల అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి వారిని తగిన విధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి దేవస్థానంలో జరిగిన అవకతవకలు అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపి మాజీ ఎంఎల్ఏ మధుసూధన్‌రెడ్డిపై విచారణ చేపట్టి శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. సమావేశంలో న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి రాయపనేని హరికృష్ణ, అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మంచినీటి సదుపాయం కల్పించండి

### -పుస్తకాల పంపిణీలో రిషితారెడ్డికి విద్యార్థుల విన్నపం



తొట్టంబేడు, జూలై 9 ప్రభాతవార్త : తమ పాఠశాలకు మంచినీటి సదుపాయం కల్పించాలని చియ్యవరం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎంఎల్ఏ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డికి విన్నవించారు. మంగళవారం మండలంలోని చియ్యవరం గ్రామంలోని ఒకే ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ చిన్నారులు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిల్ బాక్సులు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాలిమురళీనాయుడు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తొలుత విద్యార్థులకు పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని పంపిణీచేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో సౌకర్యాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరు పాఠశాలలో మంచినీటి సదుపాయం కల్పించాలని రిషితారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా పాఠశాలలో మౌళిక సదుపాయాల గురించి ఉపాధ్యాయుల నుంచి తెలుసు కున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు రిషితారెడ్డిని దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమ ంలో మాజీ మండల అధ్యక్షుడు చింతపట్ల భాస్కర్‌నాయుడు, మాజీ వైస్‌ఎంపిపి చంద్రారెడ్డి, మాజీ ఎంపిటిసి రామయ్య, పాలసరఫరా మాజీ ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి చెన్నురాఘవులుయాదవ్, ఎస్సీ సెల్ నాయకులు సాలిరాజ, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, జనసేన పార్టీ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, శంకరయ్య, వెంకటేష్, నరసింహులు, బాలాజీ, దామోదరం, వేమాలయ్య , అంగన్‌వాడీ టీచర్లు సుజాత, సుబ్బలక్ష్మి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశయ సాధకుడి ఆత్మీయ స్వాగతానికి ముమ్మర ఏర్పాట్లు

- నేడు చిట్టమూరుకు డాక్టర్ పాశం సునీల్‌కుమార్ రాక



చిట్టమూరు, జులై 9 ప్రభాతవార్త : గూడూరు శాసనసభ్యులుగా డాక్టర్ పాశం సునీల్‌కుమార్ రెండోసారి అత్యధిక మెజార్టీతో గెలుపొంది నేడు చిట్టమూరులో నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీలో పాల్గొనను న్నారు. ఈ సందర్భంగా ఆశయ సాధకుడైన డాక్టర్ పాశింకు ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపేందుకు ఊరూరు నుంచి వందలాదిగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి తమ అభిమానం చాటేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండల కేంద్రమైన చిట్టమూరులోని పార్టీ కార్యాలయం నుంచి మండల కార్యాలయాల మీదుగా కొత్తగుంట వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించిన అనంతరం మండల స్థాయి అధికారులతో జరగనున్న సమీక్ష సమావేశంలో పాశం పాల్గొననున్నారు. రైతు సేవా కేంద్రం ప్రారంభంతో పాటు దివంగత నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారు. ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని మండల పార్టీ కన్వీనర్ కిషోర్‌నాయుడు ఈ సందర్భంగా కోరారు. చిట్టమూరు మండలంలోని ప్రతి పంచాయతీలో తాగునీరు, రోడ్లు, చెరువుల అభివృద్ధికి పాశం విశేషంగా కృషి చేసి ఉన్నారు. గడచిన ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోగా, హామీలు కూడా అమలు కాకపోవడంతో వైసీపీకి బుద్ధిచెప్పిన ప్రజలు అభివృద్ధికి మారుపేరయిన పాశింకు పట్టంకట్టారు. నేడు మండలానికి విచ్చేయుచున్న పాశం సునీల్‌కుమార్‌పై మండల ప్రజల కల నెరవేరేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా మండల ప్రజలు కోరుతున్నారు. సామాన్య, పేద, మధ్యతరగతి కుటుంబాలు వైసీపీ ప్రజావ్యతిరేక పాలనలో అడుగడుగునా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. **ప్రజలు మెచ్చిన ప్రజానేతగా పాశింకు గుర్తింపు:**

ఇప్పటికే గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన డాక్టర్ పాశం సునీల్‌కుమార్‌కు ప్రజలు మెచ్చిన ప్రజానేతగా మంచి గుర్తింపు ఉంది. రాష్ట్ర రాజకీయాల్లో నల్లపురెడ్ల తర్వాత అంతటి గుర్తింపు పొందిన ప్రజల మనిషిగా రాజకీయ విశ్లేషకుల నుంచి ప్రస్తుతం వినిపిస్తున్న మాట. సందర్భంగా ఏదయినా సాయంకోసి తన ఇంటి తలుపు తట్టిన వారందరికీ తనవంతు సాయం చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపే వ్యక్తిగా ఈ ప్రాంత ప్రజలు పాశం సేవలను కొనియాడుతున్నారు. రాబోవు కాలంలో ఎమ్మెల్యేగా పాశం సునీల్‌కుమార్ తీరప్రాంతాల అభివృద్ధిపై మరింత దృష్టి నిలపడంతో పాటు ఆయా గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తే ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించవచ్చు.

# తవణంపల్లెలో డెంగ్యూ, అతిసార నియంత్రణ అవగాహన ర్యాలీ



తవణంపల్లె, జూన్ 9 ప్రభాతవార్త: మండల కేంద్రం తవణంపల్లెలో జాతీయ డెంగ్యూ, ఉధృత అతిసార నియంత్రణ మాసోత్సవల సందర్భంగా మంగళవారం మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ పి.వినయ్‌కుమార్, టీఎస్. మోహన్‌వేలుల అధ్వర్యంలో మండల వైద్యసిబ్బంది డెంగ్యూ, ఉధృత అతిసార వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి తవణంపల్లె పీహెచ్‌సీ నుండి నుండి పాత పోలీస్ స్టేషన్ వరకు గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అలాగే టి.పుత్తూరు రోడ్డులో మానహారం నిర్వహించారు. ఈసందర్భంగా డెంగ్యూ అంతం మన పంతం, 'ప్రతి శుక్రవారం డ్రైడే పాటిద్దాం' దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేద్దాం. 'అతిసారకు మూలం బహిరంగ మల విసర్జన' అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌ఓ సుబ్రమణ్యం, హెల్త్ సూపర్‌వైజర్లు రాజమణి, రాజశేఖర్, శ్రీహరి, నిర్మలమ్మ, రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం కోసమే ఉచిత ఇసుక పాలసీ

- ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకొన్న వైకాపా ప్రభుత్వం

- ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు టౌన్, జులై 9 ప్రభాతవార్త: సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమం దృష్టిలో వుంచుకుని ఇసుక ఉచిత పాలసీ అమలుకు శ్రీకారం చుట్టారని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇసుకను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని సుమారు 50 వేల కోట్ల రూపాయలు దోచుకుని పంచుకున్నారని ఆరోపించారు. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా అందించడానికి సిద్ధం అయ్యారన్నారు. ఇసుక ఉచితం కావడంతో నిర్మాణ రంగం ఊపందుకుని ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అలాగే నిరుపేదల సొంత ఇంటి కల సకారం అవుతుందన్నారు. భవన నిర్మాణ రంగం ఊపందుకుంటే పలు రకాలుగా అనేక మందికి ఆదాయ మార్గాలు మెరుగుపడుతాయన్నారు. గత ప్రభుత్వ విధానంతో రాష్ట్రంలో భవన నిర్మాణ రంగం చితికిపోయిందని ఆరోపించారు. కేవలం రవాణా ఛార్జీలు చెల్లించి ప్రస్తుతం ఇసుకను ఇసుకు వెళ్ళవచ్చునన్నారు. వైకాపా నాయకులు ఉచిత ఇసుక విధానంను జీర్ణించుకోలేక దీనిపై ఆరోపణలు చేస్తుండటం హాస్యాస్పదంగా వుందన్నారు. కొత్త ఇసుక విధానంలో అక్రమాలకు తావు లేకుండా విజిలెన్స్ కమిటీలు పర్యవేక్షణతో పాటు జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ నిత్యం పరిశీలిస్తుంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : కమిషనర్ అథితి సింగ్



తిరుపతి కార్పొరేషన్, జులై 9 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే, అంటువ్యాధులు దరిచేరవని ఆరోగ్యవంతంగా జీవించవచ్చని నగర పాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ తెలిపారు. మంగళవారం నగర పాలక సంస్థ పరిధిలోని తిమ్మినాయుడుపాళెం, హరిజనవాడ, రెడ్డిగుంట, ఉప్పరపాళెం తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి అదితిసింగ్ పారిశుధ్య, త్రాగునీటి సరిఫరాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సింగ్ మాట్లాడుతూ డెంగ్యూ, డయేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టిన వాటికి ప్రజల సహకారం కూడా ఉండాలన్నారు. వర్షాలు పడుతున్న తరుణంలో ఇళ్ళలోని కుండీలు, తొట్టెలు, ఇంటి చుట్టుపక్కల గుంటల్లో నీరు నిల్వ లేకుండా చేస్తే, తద్వారా దోమల లార్వాలను ఉత్పత్తి కాకుండా చేయవచ్చన్నారు. ప్రతివారంలో ఒకరోజైన ఫ్రైడేని డ్రైడేగా పాటించాలన్నారు. మురుగునీటి కాలువల్లో ఎక్కడా చెత్త లేకుండా చేస్తే దోమల లార్వాలు ఉత్పత్తి కావన్నారు. కాలువలు, గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. మలేరియా మందులు పిచికారి చేయాలన్నారు. నగరంలో ఎక్కడా త్రాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకుని, అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తోపాటు మున్సిపల్ ఇంజనీరు వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్‌రెడ్డి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

# స్మశాన వాటికలో సౌకర్యాల కల్పనకు చర్యలు

- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు

చిత్తూరు టౌన్, జులై 9 ప్రభాతవార్త: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎం.అగ్రహారం స్మశాన వాటికలో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మంగళవారం ఎం.అగ్రహారం గ్రామ స్మశాన వాటికను అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. స్థానికుల వినతి మేరకు స్మశాన వాటికకు కాంపౌండ్ నిర్మిణం, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమీషనర్ డాక్టర్ జె.అరుణను ఆదేశించారు. అందకు ముందు ఎమ్మెల్యే ఎం.అగ్రహారం ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాఠశాలలో మధ్యాహ్న భోజనంను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించడానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల కోరిక మేరకు పాఠశాలలో క్రీడామైదనం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



పెద్దపంజాణి జూలై 9 ప్రభాతవార్త : మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నాగిరెడ్డిపల్లిలో మంగళవారం నేను బడికిపోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బాబూరెడ్డి మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంకోసం ప్రభుత్వం అనేక రకాలసదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. నూరు శాతం బడిఈడు పిల్లలు బడిలో చేరాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాని చేపట్టిందని పేర్కొన్నారు. విద్యార్థులందరూ ర్యాలీగా వెళ్ళి బడికి నిలిచిపోయిన పిల్లలును బడికి వచ్చేవిధంగా విద్యా అవశ్యకతను వివరించామన్నారు. ఈ కర్యాక్రమంలో ఉపాద్యాయులు మీనాక్షి, వాణిశ్రీ, అంజప్ప, మాధవన్, గంగాధర్, రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నగరిలో పరిశ్రమలు స్థాపించండి

పారిశ్రామికవేత్తలకు ఎమ్మెల్యే భానుప్రకాశ్ ఆహ్వానం



పారిశ్రామిక వేత్తలతో సమావేశమైన ఎమ్మెల్యే భానుప్రకాశ్

పుత్తూరు, జూలై 9 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ (ఎఐఇఎంఎ) ప్రతినిధులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆహ్వానించారు. మంగళవారం అసోసియేషన్ ప్రతినిధులతో చెన్నైలో ఆయన టిడిపి నాయకులు గంజి మాధవయ్య, మాధవనాయుడు, లక్ష్మీపతి రాజులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గం పరిశ్రమల స్థాపనకు అనుకూలమని, పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చిన వారికి తాను స్థలం, రోడ్లు, విద్యుత్, నీరు తదితర మౌలిక సదుపాయాలతో పాటు ఇతర వ్యాపారపరమైన వెసులుబాట్లు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విజయపురం మండలంలోని కోసలనగరం ప్రాంతాన్ని ప్రధాన పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేసే ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి సాకారం చేసేందుకు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ పారిశ్రామిక వేత్తలకు తెలిపారు.

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు పరిశ్ర మల ఆకర్షించేందుకు కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందించాలని పరిశ్రమల శాఖకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎ.ఎస్.హరిప్రసాద్, అధ్యక్షుడు అరవింద్, సీనియర్ సభ్యుడు అరువెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పచ్చిగెరిగ ఊరేగింపు



రామకుప్పం, జూలై 9 ప్రభాతవార్త : రామకుప్పంలో వెలసిన శ్రీ గంగమ్మ అమ్మవారి జాతరలో భాగంగా మంగళవారం పచ్చిగెరిగను పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక సల్లాపురెమ్మ ఆలయం నుంచి మొదలైన గెరిగ ఊరేగింపునుడప్పులు, బాణసంచా పేలుళ్ల మధ్య ఘన ంగా ఊరేగి ంచారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి జంతుబలులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ గంగమ్మ, సల్లాపురెమ్మ, పోతుల రాజు ఉత్సవ మూర్తులను ఊరేగించారు. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు అన్నదానం జరిపారు.

# శ్రీవారి సేవలో ఎంపి,ఎమ్మెల్యే





తిరుమల, జులై 9ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వర స్వామిని మంగళవారం ఉదయం తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి, రాజంపేట ఎమ్మెల్యే మేడ మల్లికార్జునరెడ్డి దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# వ్యవసాయ కళాశాలలో 'అమ్మపేరుతో ఒక చెట్టు'



తిరుపతిరూరల్, జూలై 9 ప్రభాతవార్త: శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు 'అమ్మపేరుతో ఒక చెట్టు' కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం వ్యవసాయ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కళాశాలలోని మ్యాంగో గార్డెన్‌లో వివిధ రకాల మామిడి మొక్కలను నాటారు. ఈ ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి.రమణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పి.శాంతి, డాక్టర్ గణేష్‌కుమార్, డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ పి.కార్తిక్‌రెడ్డి, డాక్టర్ పి.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలఘువారాహి అలంకరణలో శ్వేతవారాహి దేవి



రామచంద్రాపురం, జూలై 9 ప్రభాతవార్త: రాయలచెరువు కట్ట సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో ఆషాఢ మాస శ్వేత వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారు లఘువారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఇందులో భాగంగా అమ్మవారిని శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరనంద మహాభారత స్వాములు ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అమ్మవారిని అభిషేకించారు. అనంతరం వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, నూతన పట్టువస్త్రాలతో విశేష అలంకరణలతో అమ్మవారిని తీర్చిదిద్ది భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఆషాఢ మాసంలో అమ్మవారిని దర్శించుకోవడం వలన భయ నివారణ, రక్షణ, విజయం, భూసమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు.

# ఉపాధి లక్ష్యాలు పూర్తికి చర్యలు : కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు టౌన్, జులై 9 ప్రభాతవార్త: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ డ్వామా పిడి రాజశేఖర్‌తో కలిసి ఉపాధి పథకం అమలు తీరు క్లస్టర్ల వారీగా పని దినాలు, చేపడుతున్న పనులు తదితర అంశాలపై ఎపిడిలు, ఎపిఓలతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులు కల్పించడానికి ఎక్కువ అవకాశం వున్న పనులపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో చేపడుతున్న ఫారంఫాండ్స్, ఫీడర్ ఛానెల్ పనులు, అమృత్ సరోవర్ పనులు, రోడ్డు ఫార్మేషన్, సప్లై ఛానెల్స్, హార్టికల్చర్, ట్రెంచ్ వర్క్స్, బౌండరీస్ తదితర పనులకు సంబంధించి కలెక్టర్ క్లస్టర్ల వారీగా సమీక్షించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కల నాణ్యతను పరిశీలించడానికి మండల స్థాయిలో ఉద్యానశాఖ అధికారి, ఉపాధి హామీ అధికారులు సంయుక్తంగా నర్సరీలను తనిఖీ చేసి అనంతరం రైతులు ఆ మొక్కలు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మ్యాంగో ప్లాంటేషన్ అధికంగా వుందని, కాబట్టి మొక్కల నాణ్యతపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే క్లస్టర్ల వారీగా చేపట్టే పనుల్లో లేబర్ మొబిలైజేషన్ ఎక్కువగా వుండాలని వారికి పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి పథకం నియమ నిబంధనలు పాటిస్తూ పనులు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం తగదని పది రోజుల్లో క్లస్టర్ల వారీగా నిర్ధేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

# విలువ చేకూరిత మాంస ఉత్పత్తుల తయారీపై శిక్షణ



తిరుపతిరూరల్, జూలై 9 ప్రభాతవార్త: 'గ్రామీణ ఎస్.సి.మహిళలకు విలువ చేకూరిత మాంస ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాభివృద్ధిని పెంచడం' అనే అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి-ఎస్సీ ఉప ప్రణాళిక కింద కేటాయించిన అభివృద్ధి నిధులతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయం సహాయక బృందాలకు చెందిన 25మంది మహిళలను మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎస్.కృష్ణవేణి పంపినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పశువైద్య విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మం ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య విలువ చేకూరిత మాంస ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాన్ని గురించి మహిళలకు సవిరంగా వివరించారు. ఈ శిక్షణలో మాంసపు సాసేజులు, చికెన్ సమోసాలు, చికెన్ ఇండ్లీలు, చికెన్ కట్‌లెట్, చికెన్ నగ్గెట్స్, చికెన్ సూప్, చికెన్ ఊరగాయలు తయారీపై శిక్షణ ఇచ్చారు. వివిధ బహుళ ప్రాచుర్యం పొందిన విలువ చేకూరిత మాంస ఉత్పత్తులైన మాంసపు కైమా ఉండలు, మాంసపు వడలు తదితర మాంసపు ఉత్పత్తుల తయారీ, నిల్వ, అమ్మకంపై శిక్షణ ఇచ్చారు. పశు ఉత్పత్తులు సాంకేతిక శాస్త్ర విభాగం సహాయ విభాగాధిపతి డాక్టర్ జి.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు, మాంస జంతువుల ఉత్పత్తిదారులు -కుటీర పరిశ్రమగా విలువ చేకూరిత మాంస ఉత్పత్తుల తయారీ'ని ప్రారంభించాలంటే వారిలో నైపుణాభివృద్దిని, -వ్యవస్థాపక దృక్పథాన్ని పెంచాల్సిన అవసం ఎంతైన ఉందన్నారు. నైపుణ్యాభివృద్ధి ఉంటే వివిధ రకాల మాంసం ఉత్పత్తులను తయారు చేసి, వాటిని తగినరీతిలో నిల్వ, మర్కెటింగ్ చేసి ఆధాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ శిక్షణలో పొందిన మహిళలకు ధృవీకరణ పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అబివృద్ధికి అన్నివిధాలా కృషిచేస్తా : ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి

-నాయకులు నిత్యం ప్రజల్లోఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



పెద్దపంజాణి జూలై 9 ప్రభాతవార్త : పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి వచ్చేఐదేళ్ళలో అన్నివిధాలా అభివృద్ధిచేసేందుకు తాను సాయశక్తుల కృషిచేస్తానని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోనుమాకులపల్లెల్లో పలుపంచాయతీలకు చెందిన ముఖ్య నేతలతో ఎన్నికలఫలితాలపై ఆయన సమీక్షసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని తనకుఅందించాలని కోరారు. పలమనేరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ఒకనివేధిక రూపొందించి దానిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్ళి విడతలవారిగా అభివృద్ధిపనులు చేపట్టడం జరుగుతుందన్నారు. 2014-2019మధ్య అసంపూర్తిగా ఉన్న పనులనుసైతం త్వరగా పూర్తిఅయ్యేలా కృషిచేస్తామన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాలను అర్హులైన పేదప్రజలకు అందించేలా పార్టీనేతలు సహకరించాలని కోరారు. ప్రజాసేవ చేయడం తమబాధ్యతగాబావించి నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారిసమస్యల పరిష్కారానికి చొరవచూపాలన్నారు. గ్రామాల్లో మౌళికవసతుల కల్పనకు తగునిధులు మంజూరుచేయించి ప్రజలకు మౌళికవసతులను కల్పించడం జరుగుతుందన్నారు. పలమనేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపుకు కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో మాజీ ఎంపిపి విజయ్‌భాస్కర్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షలు ఆనంద, కార్యదర్శి చలపతి, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, మురహరిరెడ్డి, శ్రీరాములు రెడ్డి, ఎస్‌వి9 నాగిరెడ్డి, బెరబల్లి చెంగారెడ్డి, క్రిష్ణారెడ్డి, వేమారెడ్డి, రోజారెడ్డి, సుధాకర్ రెడ్డి, వేణుగోపాల్ నాయుడు, కెలవాతి సుబ్రమణ్యం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆయన వాహనానికి అయితే మినహాయింపు

శ్రీకాళహస్తి, జూలై 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిబంధనలు చట్టాలు కొందరికి వర్తిస్తే మరి కొందరికి చుట్టాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే కార్లు, వాహనాలు నిర్ణీత కేటాయింపు స్థలాల్లో పార్కింగ్ చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇఓ కొన్ని సంస్కరణలను చేపట్టి అమలు చేస్తున్నారు. ఇక్కడకుఎవ్వరి ద్విచక్రవాహనాలను అనుమతించరాదన్న నిబంధనలతో సిబ్బంది కట్టడి చేస్తున్నారు. అయితే ఏ కారణాల చేతనో ఓ అధికారి వాహానానికి మాత్రం మినహాయింపు ఇస్తున్నారు. ఈ సంఘటనపై ఆలయంలోని సిబ్బంది అధికారులు చెవులు కొరుక్కుంటున్నారు. ఇఓ ఆదేశాలు ఆ అధికారికి వర్తించవా? అంటూ అవాక్క అవుతున్నారు.

# పె(ద్ది)ద్దరెడ్ల ఖాతాలో పరిశ్రమల భూములు : త్వరలోనే వీటిపై విచారణ



తొట్టంబేడు, జూలై 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిరుపేద నిరుద్యోగుల ఉపాధికోసం ఏర్పాటు చేసే పరిశ్రమలకు సంబందించిన భూములను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డిల సతీమణుల పేరుతో ఉన్నాయని త్వరలోనే ఈభాగోతాన్ని భయటపెడుతామని ఎంఎల్‌ఏ బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తెలిపారు. ఎంఎల్‌ఏగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమశాఖలకు చెందిన భూములు మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ మధుసూధన్‌రెడ్డిల సతీమణులపై ఉన్నట్లు సమాచారం అందని వాటిని త్వరలోనే బట్టబయలు చేసి సమగ్ర విచారణ చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి త్వరలోనే కాల్ సెంటర్ ఓటిపి సిస్టంలో ఏర్పాటు చేసి ప్రతి మండల కేంద్రంలో కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో రాక్షస రాజ్యం పోయి రామరాజ్యం పాలన ప్రారంభమైందని ఉచిత ఇసుక విధానం అమలులోకి రావడం, అన్నా క్యాంటీన్లు అందుబాటు లోకి వస్తున్నాయని ఎంఎల్‌ఏ తెలిపారు. నియోజకవర్గంలో భూ ఆక్రమణ బాధ్యతలు తనను నేరుగా కలిపి పిర్యాదులు చేస్తే న్యాయం చేస్తామని అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులపై క్రిమనల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు, రైతులు తమ భూములను మాజీ ఎంఎల్‌ఏకి అగ్రిమెంట్‌ను బలవంతంగా చేసి ఉంటే తనను నేరుగా కలవాలని కోరారు. శ్రీకాళహస్తిలో రౌడీయుజం చేస్తే సహరించేది లేదని రౌడీ యుజం చేసే వారి తాట తీస్తామన్నారు. బాలుర ఉన్నత పాఠశాల, కాసాగార్డెన్ వద్ద ఉన్న బాలికల వసతిగృహంలో విద్యార్థులకు త్వరలోనే సకల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఇసుక పాలసీ విధానంతో భవననిర్మాణ కార్మికులకు లబ్ధిజరుగుతుందన్నారు. త్వరలోనే ప్రెస్‌క్లబ్ ఏర్పాటు భవనాన్ని కేటాయి స్తామన్నారు. చెన్నైలోని జెపి కంపెనీ సుమారు 50వేలకోట్లు సంపాదించుకున్నట్లు సమాచారం ఉందని దీనిపై విచారణ కమిటీని నియమిస్తు న్నామన్నారు. నేడు మైనింగ్ అధికారులతో పంచాయతీరాజ్ అతిధిగృహంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నా మని, ప్రతి సోమవారం నుంచి పంచాయతీరాజ్ అతిధిగృహంలో ఉదయం 9 నుంచి మద్యాహ్నం 12.30గంటల వరకు మరియు మద్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7గంటల వరకు ప్రజలకుఅందుబాటులో ఉంటానని సమస్యలు ఉన్న ప్రజలు తనను నేరుగా కలసి సమస్యలను తెలిపితే పరిష్కరిస్తామన్నారు. ఉచిత ఇసుక పాలసీ విధానంలో డంపింగ్‌యార్డు కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ప్రజల సమస్యలను అందుబాటులో ఉంటానని తెలిపారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మన్‌రంగినేని చెంచయ్యనాయుడు పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.